

# సంసారం

వరశ్రీ

"ఏదినం ఒంటిగంట బండికయినా వాళ్లు ఊరు పోయి రారూ? ఎంతసేపూ నేనొక్కతెనే ఏడవాల్సివుంది. మీకు చీమ కుట్టినట్లయినా వుందా మరి. మీకేమి తెలుస్తుంది ఇంట్లో గొడవలు. నోట్లో చుట్ట, బల్లమీద కాఫీ వుంటే చాలు మహారాజులాగ కూర్చొని కాగితాలు తిరిగేస్తుంటారు. ఒక్క ఆఫీసు పని చేస్తే చాలా. ఇంట్లోపనులుమాత్రం చూసుకోవద్దూ? ఎదిగిన పిల్లలు ఇంట్లో తిరుగుతూవుంటే నామనసు ఎలా కొట్టుకుపోతూందో మీకేమన్నా తెలుసా. తెలిస్తే మీ రిట్లే వుంటారా. రాధమ్మకయినా యీ సంవత్సరము పెళ్లిచేస్తే కొంచము భారము తీరినట్లుంటుంది. అంతటితో అయిందా. ఇట్ల చేసి చూసేసరికి ఇంకో తల్లి తయారుగ వుంది. ఏదో కడుపుమంట పట్టలేక ఇలా వాగితే మీకేమొ కస్సుమంటారు. మీరు సరిగ చేస్తే నే నెందుకు మాట్లాడాలి?" ఇంకా సాగిస్తూనే వుంది సుభద్రమ్మ శివరామయ్యగారికి వడ్డిస్తూ.

శివరామయ్యగారిది కొద్దో గొప్పో ఉన్న సంసారమే. తాసిలుదారుఉద్యోగము చేస్తున్నారు. సుభద్రమ్మకూడ ఎంతో పొదుపుగానే 'వాళ్లకేం' అన్నట్లు కాపురం చేసేది. నలుగురు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు కలిగారు. ఏలోటూ లేకుండ పిల్లల్ని పెంచి పెద్దవాళ్లను చేశారు. రాధమ్మ స్కూలుఫైనలువరకు చదివింది. ఫిడేలు కూడ నేర్చుకొంది. 'మంచి చురుకైనపిల్ల'గానే పేరు పొందింది. అమ్మాయి ఏటేటా పరీక్షవుతూంటే తలిదండ్రుల సంతోషానికి అంతుండేది గాదు. అంతేగాని అమ్మాయికి ఏమాత్రం చనువిచ్చేవాళ్లు గాదు. స్కూలుఫైనలు పాసయేసరికి రాధమ్మకు పదహారో సంవత్సరం. కూతురి మార్కులు చూసేసరికి శివరామయ్య ఇంకా, చదివించాలని, పట్టుపట్టాడు. ఎంత పట్టుదలలైనా భార్యదగ్గర పటాపంచలు కావలసిందే' సుభద్రమ్మ 'ఆడపిల్లలకు చదువెందుకండి. అని, దానివలన, కలిగే అనర్థాలూ వాళ్లు ఎదుర్కోవలసిన కష్ట నిష్టూరాలూ అన్నీ ఒక్క పెట్టున ఏ అక్రూరదండకమో ఏ నారాయణకవచమో వర్ణించినట్లు ఏకరువు పెట్టేసరికి శివరామయ్య గప్ చిప్ అయ్యాడు. ఆదినమే వరాన్వేషణకు గట్టి చెప్పుల జత కుట్టించి (ఏడుజతల చెప్పులు అరిగిపోతాయని సామెతగదండీ) స్వయంగానే తొడిగింది భర్తకు ఉత్తరీయం సవరించి.

ఎవడైనా చదువుకొన్న అబ్బాయి, ముక్కూ ముఖమూ తిన్నగా వుండే అబ్బాయి, భూమీ పుట్రా ఉండే కుర్రవాడు ఎక్కడైనా వున్నాడా అని తనకు తెలిసినవారినందరిని అడిగాడు. చాలామందిని చూడడం గూడ తటస్థించింది. ఎవ్వరూ నచ్చలేదు.

(20-వ పేజీ చూడండి)

# సంసారం

(-16వ పేజీ తరువాయి)

వుంటే చదువు లేదు. చదువుంటే పూజ్యం. లేకపోతే అబ్బాయి మానుంతమో వరాహమో కావటం. దీనితోనే రెండు సంవత్సరాలు గడిచాయి. సుభద్రమ్మకు పిల్లల పెండ్లిదే దిగులయింది. పిల్లలకు పెళ్లి చేయలేమేమో ననుకొన్నారు. శివరామయ్య లోపల లేని దిగులుపడేవాడో కాని పైకిమాత్రం బాగానే కనిపించేవాడు. ఎంతసేపైనా సుభద్రమ్మకు ఆయనేమీ ప్రయత్నించడం లేదని కోపం. ఇంతకు ముందంతా ఇంట్లో ఎప్పుడూ కళకళలాడుతూ నవ్వుతూ పేలుతూ వుండే వాళ్లు. ఇప్పుడెప్పుడయినా శివరామయ్య తీరికగా తన పై ఆఫీసరు సంగతో ఆఫీసులో సంగతో చెప్పవస్తే కొద్దిసేపుమాత్రం ఊకొట్టేది. ఇక ఉండబట్టలేక తనేమొ ఇంత దిగులుపడిచస్తుంటే యీయనకు చింతాకంతయినా దిగులు లేదే అని పిల్లల పెండ్లిమాటెత్తి ఎత్తిపొడిచేది. దీనితో ఇద్దరికీ ఎడమొహామూ పెడమొహమ్మూను. ఆయన చక్కా లేచి కాగితాల కట్టముందు కూర్చునేవాడు. వీళ్ల తగవులూ వీళ్ల దిగుళ్లూ చూస్తుంటే రాధమ్మకూ విసుగేసేది. తనవలనేగదా యీ కలతలు యీ కష్టాలని చాటుమాటుగా కళ్లనీళ్లు పెట్టుకొనేది.

శివరామయ్యకు ఒక్కతే చెల్లెలు. ఆమెకు రామం ఒక్కడే కొడుకు. వాడికి చిన్నప్పటినుంచి చదువు ఒంటబట్టేది కాదు. మెల్లిగా స్కూలుఫైనలువరకు వచ్చాడేగాని పరీక్ష తప్పాడు. వాళ్ల నాయనకరణీకం వాడికే వచ్చింది. చిన్నప్పటినుండి రాధమ్మను కొడుకుకు చేసికోవాలని వుబలాటపడుతూండే దావిడ. రామానికివ్వడం సుభద్రమ్మకేమీ ఇష్టంలేదు. మంచి సంబంధం చేయాలని ఎంతో ముచ్చటపడుతూండేది. ఒకవైపేమొ ఆడబడుచును త్రోసెయ్యడ మెట్లనా యని తికమక పడుతూండేది. ఆదినము ఊరిలో పెద్దల్ని నలుగురిని వెంటబెట్టుకొని శివరామయ్యగారి చెల్లెలూ, ఆమెభర్త ఏవిషయమూ నిశ్చయము చేసుకోవాలని వచ్చారు. అప్పుడే శివరామయ్య గుండె గతుక్కుమంది. అయినా 'ఇదేమయినా బొమ్మలాటసంగతా నీళ్లు నములడానికని, ఎట్లో ధైర్యం చిక్కబట్టి తన మనసులో మాట మెల్లగా వెళ్లగక్కాడు. చెల్లెలు కళ్లనీళ్లు పెట్టుకొంది. తనని ఆ నలుగురిలో అవమానపరిచా డనింది. ఇక నీ గడప తొక్కితే నేను సుబ్బమ్మను కాను అని మంగమ్మ శపథంలాంటిదానిని విసరి 'పిన్నీ భోంచేసి పో' అని సుభద్రమ్మ అడ్డువచ్చినా నిలువకుండ వెళ్లిపోయింది.

ఎవరో అబ్బాయి బి. ఏ. రెండవసంవత్సరము, ఆ వూరి కాలేజీలోనే చదువుతున్నాడని ఒక పెద్దమనిషి కబురు చెప్పాడు. అప్పుడే కొండెక్కినంత సంతోషమయింది. ఈ సంబంధమన్నా కుదిరేటట్లు చేయమని రాముని కో టెంకాయ, ఈశ్వరుని కో టెంకాయ కొట్టి భక్తిశ్రద్ధలతో మ్రొక్కారిద్దరూ. అబ్బాయిని చూడాలని కాలేజిదగ్గర హాజరయాడు. కాలేజి క్లర్కు తనకు తెలిసినవాడే కావటం మూలాన అతనిగదిలో కూర్చున్నాడు. పది గంటలయేసరికి గుంపులు గుంపులుగా వస్తున్నారు స్టూడెంట్సు. కాలేజిఎదురుగా చెట్టుక్రింద అంతా సైకిల్సు కాను కొని పాంట్ మడతలు సరిచేసుకొంటూ, క్రాపింగ్ సరిదిద్దుకొంటూ, మందహాసాలను చలాకీగా విసురుతూ ఏ నారాయణరావు పోజో, నాగేశ్వరరావు పోజో పెట్టి నిలుచున్నారు; ఇక దిగబోయే స్త్రీజనాన్ని, కటాక్షాధులయి వేంచేసే వనితాలోకాన్ని వీక్షించి తన్మయులవడానికి. మరి పావుగంటలో ఆ అబ్బాయి–పేరు నారాయణరావు లెండి–గూడ వచ్చాడు. చూడడానికి బాగానే వున్నాడు. కళ్లకద్దాలూ, చేతికి వాచీ,... అంతా నవపంథాలోనే వుంది వేషం. ఇక నేం. ఇంటికి నేరుగా వెళ్లి ఈ వార్త చెప్పాడు భార్యకు–ఆ రాత్రంతా భార్యాభర్తలిద్దరూ ఆలోచించారు ఎవరిని పంపుదామా అని. మొదట శివరామయ్యగారే వాళ్లఊరు పోవాలనుకొన్నారు. కాని బాగా ఆలోచిస్తే తాను పోవడమేమంత సబబుగా కనిపించలేదు! 'వాళ్లేమైనా తెలిసినవారా—కూతురి నిస్తా నమ్మా అని వాళ్ల వాకిటికి, అందులో మొగ మెరుగనివాళ్లింటికి ఎట్లా పోవడం? ఎంత నామోషీగా వుంటుంది. సుబ్బయ్యగారిని పంపి సంగతి సందర్భాలు కనుక్కొని ఆ తరువాత పోవడమైనా బాగుంటుంది.' తెల్లారే లేచి సుబ్బయ్యగారిని వాళ్లఊరు పంపించారు.

నారాయణరావుకు తండ్రి చిన్నానాడే చనిపోయాడు. తల్లిమాత్రం వుంది. తండ్రి దినాల్లో చాలా పెద్దకాపురం. ఆయన చనిపోయాక తల్లివైపుచుట్టాలు ఆమె అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు వాళ్లవాళ్ల ఆస్తులు చీట్లాటలకో ఇంక దేనికో అర్పణ చేసికొని అక్కగారిల్లు చేరుకున్నారు. ఆమెకు ఊరటగ వున్నట్లు ఆమె ఆస్తి హయానం చేసేటందుకు పెత్తనమంతా ఆమె అన్నదమ్ములే చేతికి చిక్కించుకొన్నారు. చెల్లెళ్లకు పెళ్లిళ్లు చేయటం, వాళ్లకు సారెలూ చీరలూ అన్నీ ఆమె నెత్తినే పడ్డాయి. పండిన వడ్లు కళ్ళముదగ్గరే వాళ్లంతా చాటుమాటుగా అమ్మి యాదర కట్టుకొనేవారు. ఏవో మిగిలిన ధాన్యం ఇంటికి తోలుకొస్తే అవికూడ తెచ్చినవి తెచ్చినట్లుండేవి కావు. ఆ యమ్మ ఈ యమ్మ పక్కింటివాళ్లకో సేద్యగాళ్లకో దొంగతనంగా వడ్లు కొలిచి ఆ డబ్బుతో చీరెలో, రిబ్బన్లో, గాజులో కొనుక్కొనేవాళ్లు. ఇలాగయితే ఆ కాపురం బాగుపడే దేముంది?

సుబ్బయ్యగారు వాళ్లకు ఎక్కడో దూరపుబంధువు. ఆయన వాళ్ల ఇంట్లో చాల చనువుగానే మసులుతూంటాడు. పిచ్చాపాటి మాట్లాడిన తరువాత సుబ్బయ్యగారన్నారు. "అయితే అబ్బాయి పెండ్లిమాటేమనుకొన్నారు. ఈముహూర్తానికయినా చేయండి బాబూ. ఇంతకూ మంచి సంబంధం ఎక్కడా దొరక లేదా?"

"మంచిసంబంధాలు లేకేం? వాడికి చదువుకొన్న పిల్ల కావాలని వుంది. అందుకే చూస్తున్నాం. ఎవరయినా ఉన్నారా మీకు తెలిసినవాళ్లు?"

ఇప్పుడు సుబ్బయ్యగారికి వీలయింది తాను వచ్చిన సమాచారము జారవేయడానికి. అన్ని సంగతులు వున్నవి వున్నట్లు చెప్పి 'తరువాత మీ యిష్టం.' అన్నాడు. 'సరే ఆలోచించి ఏ సంగతీ చెప్తాం. అబ్బాయికేమొ ఐదువేలు కట్న మివ్వాలి. మిగత మర్యాదలు అందరికీ తెలిసినవేగదా,' అని సాగనంపారు.

ఈ సంగతి చెప్పేసరికి శివరామయ్యగారికి గుండెల్లో రాయిపడ్డట్టయింది. 'అబ్బాయి మంచివాడే. చదువుకొంటున్నాడుకూడాను. కాపురము చూస్తే మంచిదే. అయినా ఐదువే లెక్కడనుండి తెచ్చేది. నాకింతకు ఉండేది ఐదు ఎకరాలాయె. రాధమ్మ కిచ్చినట్లే మిగత ముగ్గురికీ ఇవ్వాలిగదా. వీళ్లకే ఉన్నదికాస్త దోచి

గనోక్యూర్
అన్నిసెగలకు గంటలలోగుణము
ఈశ్వర ఫార్మసీ, రాజమండ్రి.

పెట్టే మగపిల్లల కేమిచ్చేది? పెద్దవాడికి నెల నెలకు డెబ్బై రూపాయలు పంపాలి. ఏం చేసేది?' అని చుట్ట కాలుస్తూ వాలుకుర్చీలో ఉండుకొని శూన్యాని కేసి చూస్తున్నాడు. ఇంతలో సుభద్రమ్మ గూడ భోజనాలయి తాంబూలము వేసుకొంటూ వచ్చి ప్రక్కనే చతికిలబడింది.

'ఏమే విన్నావుగదూ సుబ్బయ్యగారు చెప్పింది. ఇంతకూ ఏమాలోచించావు?'

'ఏమి ఆలోచించేదుండి. మీరేమో చిల్లిగవ్వకూడ ముట్టకుండ నౌకరిచేస్తిరి. నేను నెత్తిన నోరు పెట్టుకొని చెప్పాను. ఇప్పుడు తెలివొచ్చిందిగాబోలు.'

నాదగ్గర కొంత మంది డబ్బు తెచ్చి యిచ్చారు! అయితే నేను చేయగలిగిందేముంది? తీసుకొంటే బ్రతుకనిస్తారా?

'మీకందరికంటె ఏం ప్రమోషనులయాయి. అన్ని వేలూ లంచం తీసుకొన్న రామచంద్రరావు డిప్యూటీ కలెక్టరయాడు గదా. ఇప్పుడు కావలసింది రాధమ్మపెళ్లే. రెండెకరాలయినా అమ్మితే ఎట్లో ఒకవిధముగ సరిపోతుంది. నామెళ్లో దండ పెట్టితే సరిపోతుంది. ఇక నేను మొండి మెడతో తిరగాలిగాబోలు. అమ్మాయికి గాజులున్నాయి లెండి.'

'అయినా ఐదువేలెలా యిస్తామే. వెయ్యిన్నూట పదహార్లయినా యిస్తామని చెప్తాము.'

'సరే ప్రయత్నిస్తాము. సుబ్బయ్యగారిని తీసికొని మీరే పోయిరండి'

శివరామయ్య. ఆఫీసుకు రెండురోజులు సెలవు పెట్టి వాళ్లవూరు పోయాడు. వియ్యంకులు బాగానే మర్యాదలు చేశారు. భోజనాలయాక అన్నివిషయాలు తీరుబడిగా మాట్లాడారు. కట్నాలవిషయంలో పేచీపడ్డారు.

"ఐదువేలిస్తేగాని చేసుకోమండి. నిన్ననే ఒకాయన వచ్చిపోయాడు పదివేలిచ్చి పిల్లనిస్తానని. వాళ్లేమో పెద్ద ఆస్తిమంతులట."

ప్రయాణమయి వచ్చేటప్పుడు పిల్లవాని మేనమామ "అబ్బాయికి చదువు పూర్తయిన తరువాత చూస్తాములెండి" అన్నాడు.

భార్యాభర్తలు మళ్ళీ తెగని ఆలోచనలో పడ్డారు. 'వాళ్లు మాట్లాడడం చూస్తే అంత కట్నం ఇవ్వకపోతే చేసుకొనేట్లు లేరు. సరే. కాలము మారినప్పుడు మనమేం చేస్తాము." ఐదువేలూ కట్నమిస్తామని సుబ్బయ్యగారిని మళ్లీ రైలెక్కించారు. తరువాత రెండు నెలలకిగాని వాళ్లు అమ్మాయిని చూడడానికి రాలేదు. ఎన్నో రాయబారాలూ సంధులు జరిగినతరువాత మాఘమాసంలో పెండ్లిచేయడానికి నిశ్చయించారు. శివరామయ్యగారు రెండెకరాలు అమ్మి రెండువేలవరకూ అప్పుచేసి పెండ్లిచేశారు.

నారాయణరావు ఇంకా చదువుతూనే వున్నందున రాధమ్మ అమ్మగారింట్లోనే వుండిపోయింది. పక్కింటి ఇన్స్పెక్టరుగారి అల్లుడు అప్పుడే డెప్యూటీ తాసిల్దారంటే తన అల్లుడెప్పుడు బి. ఏ. పాసవుతాడా ఎప్పుడు పెద్ద ఉద్యోగస్థుడవుతాడా అని పాపం సుభద్రమ్మ వువ్విళ్లూరుతుండేది. నారాయణరావు నెలకు నాలుగురోజులయినా అత్తగారింట్లో మకాం వేసేవాడు. ఆ సంవత్సరము ఇంతకూ ఒక్క పార్టులోనే పాసయాడు. అత్తగారు అల్లుడికంటె ఎక్కువగా దుఃఖపడ్డారు. సెప్టెంబరు మార్చిలకు తిరిగి తిరిగి ఆశ వదులుకొన్నాడు. సరే ఆస్తి ఉందిగదా అదయినా పెట్టుకొని కాలక్షేపం చేస్తారుగదా అని ఊరటచెందింది సుభద్రమ్మ. ఏమి చెడుకాలమో ఏమోగాని నారాయణరావుకు ఎవరో ఇద్దరు ముగ్గురు స్నేహితులు బాగా నూరిపోశారు 'వ్యాపారము చేస్తే చిటికెలో లక్షాధికారులవుతాం. ఈ వెధవ ముండ ఉద్యోగాలు చేసి పైఆఫీసర్ల దగ్గర చీవాట్లుతినడమూ ఇంతేగాని మనకుస్వతంత్ర జీవనమెక్కడుంటుంది' అని. మామగారు తన ఆఫీసులోనే గుమాస్తాగా చేర్పిస్తానని చెప్పారు. అయినా వినలేదు; గుమాస్తా పని తన అర్హతకు తగనిదని. తమ పిల్లవాడయితే నాలుగు తిట్లో తిమ్మో చేర్పిస్తారు. పరాయి వాడిని బలవంతపెట్టడం బాగుంటుందా? 'సరే నీ యిష్టం' అన్నారు. ఎవ్వరికీ చెప్పకుండా స్నేహితులతో ఆలోచించాడు ఏ వ్యాపారం చేస్తే త్వరలో కోటికి పడగలెత్తుతామని. ఏమనుకొన్నారో ఏమో సినిమా ప్రొడ్యూసర్లుగా తయారయ్యారు. ఇద్దరూకలిసి 50 వేలయినా పెట్టుబడి పెట్టాలనుకొన్నారు. తనకేమో భూము లమ్మితేగాని డబ్బురాదు. అమ్మదగ్గర మెల్లిగా యీ మాట చెప్పేసరికి ఆమె మండిపడింది. కళ్లనీళ్ళు పెట్టుకొంది కొంప నాశనము చెయ్యవద్దని. మేనమామలుగూడ ఎగిరిపడ్డారు. నిరాహారదీక్షపట్టేసరికి కోపంగానో తాపంగానో నీ తలపాడు ఎట్లయినా చేసికోమన్నారు. ఒక్కసారిగ పదెకరాలమ్మి ఇరవై వేలూ మూటగట్టి స్నేహితుడితో పట్నం చేరుకొన్నాడు. ఇది సుభద్రమ్మ శివరామయ్యలకు తెలిసేసరికి నిలువునా నీరయ్యారు. 'ఇంత కష్టపడి పెళ్లిచేసింది ఇందుకేనా? ఏదో మంచివాడనుకొంటే ఇంత పని చేశాడే. వాళ్లంతా అత్తా మామ బోధించారనుకోరూ?' అని వాపోయారు. పిల్లవాడి చుట్టాలంతా వీళ్లనే తిట్టిపోశారు మంచిసంబంధమే చేశామని.

కవి, డైరెక్టరూ వచ్చారు. ఇక కథ వ్రాయను మొదలుపెట్టారు. డైరెక్టరుకు ముందుగానే పదివేలిచ్చారు. మొదట్లోనే ప్రొడ్యూసర్లకూ డైరెక్టరుకూమనస్పర్థ లేర్పడ్డాయి. డైరెక్టరు చక్కా తనదారి చూచుకొన్నాడు. పదివేలూ సమర్పించుకొని గుడ్లు మిటకరించారు. అంతకంటె ఇంకేం చేస్తారూ? కోర్టు కెక్కితే సినిమా అంతటితో ఆగిపోవలసిందే. మళ్ళీ ఇంకో డైరెక్టరును తీసుకొచ్చారు. ఆయన కథ చదివి చప్పరించాడు. మళ్లీ 'రెడ్ [illegible] మొదలాడు' బేరానికి దిగింది. కవికి బలేకోప మొచ్చింది. ఎన్నాళ్లూ మళ్లీ కథ రాస్తూ కూర్చుంటే తనకు జరగదని డైరెక్టరు త్రొక్కినదారే త్రొక్కాడు. మళ్లీ ఇంకొక కవి; ఆయనకు కట్నం. ఈవిధంగా ఒకప్రక్క డబ్బు ఖర్చయిపోతూవుంటే ఈ పిల్లకారంతా చేరి ఇక నలుగురి స్నేహితుల్ని వెంటేసుకొని ప్రొద్దున లేచింది మొదలు సాయంత్రం వరకూ కార్లలో తిరగడం, సినిమాలకు పోవడం, ఆ టాయిలెట్స్, ఆ డ్రెస్సులు చెప్పడానికే వీలు లేకుండా వుండేది. దీంతో డబ్బంతా దుబారాచేశారు. మెల్లిగా షూటింగు మొదలుపెట్టేసరికి చేతిలో డబ్బంతా ఖాళీ అయింది. ఆ వాటాదారు నారాయణరావును డబ్బు తెమ్మని తొందర సాగించాడు. స్నేహితుడి బాధ పడలేక అత్తగారింటికొచ్చి కూర్చున్నాడు.



ఉబ్బసము
శాశ్వతముగ
నయమగును
ఇరువది ఎనిమిది సంవత్సరములనుంచి
వైద్య ప్రసిద్ధిగాంచిన శాస్త్రోక్తమగు
ఉబ్బస నివారిణి.
పురోహిత్ శ్వాసహరి
మంచి కెమిష్టులవద్దను, తయారు
చేయువారివద్దను 3 కా. 6 కా.
12 డోసులు సీసాలు రు. 3/8/-
రు. 6/-, రు. 10/- లకు లభించును.

డాక్టరు-పురోహిత్ ఫార్మసి
కొల్హాపూరు (ఎమ్. ఎస్. ఎమ్. రైల్వే

మెల్లిగా భార్యచెవిలో ఊదాడు డబ్బు కావాలని. పైగా భార్యతో 'నిన్నింత కష్టపెట్టాను అంత కష్టపెట్టా' నని రెండు బొట్లు కన్నీరు కార్చాడు. రాధమ్మ వంటింట్లోకి పోయి కూర్చుంది అమ్మ దగ్గర.

'అమ్మా! మీ అల్లుడికి డబ్బు కావాలట నే. ఇప్పుడు డబ్బు పెట్టకపోతే ఇరవై వేలూ పోతాయని చెప్పారమ్మా.'

'పోతే పోనీ. మనతో ఒక్క మాటయినా చెప్పాడా? మా కుండే కష్టాలు ఎవరితో చెప్పుకోనూ? సుబ్బు ఒక్కటే కొని క్కోని దగ్గుతూంది. పిల్ల ఏమైనా ఉందా. మందుల కిప్పుడు నూరురూపాయలు కావాల. మా కెవ రిస్తారు.'

'...............'

'మనకుమాత్రం అప్పెవరిస్తారు. పెండ్లినాడు చేసిన అప్పు ఇంకా తీరనే లేదు. మంచి అల్లుడే దొరికాడు మన కర్మకొద్దీ.'

ఎట్లో వెయ్యిరూపాయలు అప్పుచేసి అల్లుడికిచ్చిపంపారు. ఈసారి భార్యనుకూడ తీసుకపోయాడు పట్నం కాపురానికి. వాళ్ల ఆఫీసు మేడపైన ఒక గదిలో కాపురం పెట్టాడు. ఇంట్లో దర్జాగా జరుగుతూవుంది. కాఫీలు, ఫలహారాలూ, - అంతా పైపందాలోనే జరుగుతున్నాయి. వెయ్యిరూపాయిలు ఎలా పోయాయో తనకే తెలీదు. గట్టిగా అడిగితే స్నేహితుడు 'ఏం బ్రదర్. అంత నమ్మలేకుండా ఉన్నావే' అని వీపు చరుస్తాడు. ఒకటి రెండుసార్లు ఉండబట్టలేక అడిగేసరికి భగ్గుమన్నాడు. నారాయణరావు అసలే నోరులేని పెద్దమ. కిక్కురు మనలే దంతటితో. అతని మాటంటే సుగ్రీవాజ్ఞ అయింది. డబ్బు డబ్బని వేధించుకు తినసాగాడు. ఏమీ చేయలేక భార్య నగలన్నీ అమ్మివేశాడు.

కొన్నాళ్ళకు నారాయణరావుకే తెలివొచ్చింది. తన కప్పుడు ఇద్దరు పిల్లలు. ఎంతకాల 'మత్తగారిని బాధపెట్టడం? 'ఏదో గుమాస్తాపనిఅయినా చూచుకొందాం. వీళ్లేమో మీనమేషాలు లెక్కపెడుతూ కూర్చున్నారే కాని సినిమా మొదలుపెట్టేటట్లు లేదు. లాభ మివ్వకపోతే పోయాడు. నా అసలయినా ఇస్తాడో లేదో' అని ఒకటే కలవరపడజొచ్చాడు. తెల్లారే మామగారికి జాబు వ్రాశాడు ఏదో నౌకరి చూడమని. అదృష్టంకొద్దీ రెవిన్యూ ఇన్‌స్పెక్టరయ్యాడు. స్నేహితులంతా పోవద్దని చెప్పారు. పాటూదారు అసలే మాట్లాడలేదు. ఎవ రేమన్నా లెక్కచేయకుండ ఉద్యోగంలో చేరాడు. సినిమా ఇంకా పూర్తికానే లేదు.

★

## ★ విచిత్రవిజయం ★

లాసాకి 300 మైళ్లలో తూర్పు టిబెట్‌లో ఉన్న చాండో దుర్గాన్ని చీనా కమ్యూనిస్టులు కేవలం దీపావళి బాణ సంచాతో జయించిన విచిత్ర యుద్ధాన్ని ఒక టిబెట్ ప్రభుత్వోద్యోగి వివరించాడు. ఈ విచిత్ర యుద్ధంలో ఒక్క ప్రాణికూడానష్టపడలేదు.

ఈ కోటను దలైలామా సైన్యంలో కెల్ల సమర్థులైనవారు మూడు వేలమంది కాపాడుతున్నారు. ఒకనాడు అర్ధరాత్రి వేళ చాండో దుర్గంలోనివారికి పెద్దశబ్దం వినపడింది. ఆకాశమంతా రంగుల రాకెట్లతో, బాణసంచాతో వెలిగింది. నగరవాసులంతా మేలుకున్నారు. కోళ్లుకూశాయి. కుక్కలు మొరిగాయి. చాండో దుర్గాన్ని కమ్యూనిస్టులు చుట్టుముట్టారని పుకారు పుట్టింది. కాని వాస్తవంగా కమ్యూనిస్టులు దుర్గానికి కొంతదూరంలో దాక్కున్నారు.

దుర్గాన్ని రక్షిస్తున్న జనరల్ నగాబూ భయపడ్డాడు. పెద్ద సైనికసమూహం ముట్టడించిందని ప్రకటించి, పొట్టి గుర్రాలకు జీనులు వేసి పశ్చిమ దిశగా పారిపోయాడు.

నాయకుడు లేని టిబెటన్ సేనలు ఆయుధాల్ని విసిరేసి, కనిపించని శత్రువుకు దూరంగా పారిపోయారు.

తెల్లవారేసరికి ముట్టడి చేసినది గుప్పెడు మందిలేరనీ, వారైనా రాత్రివేళ బాణసంచా కాల్చి వెళ్ళిపోయారనీ తెలిసింది. ఈవార్త తెలియగానే జనరల్ నగాబూ తిరిగివచ్చి తన సైనికుల్ని చేర్చుకున్నాడు. కాని ఈ లోగా కమ్యూనిస్టు సైనికులు ఒక్క తుపాకి పేల్చకుండా, ఒక్క ప్రాణిని చంపకుండా దుర్గంప్రవేశించి, లోపల బురుజుల చాటున దాగారు. టిబెటన్ సైనికులు దుర్గంప్రవేశించగానే, కమ్యూనిస్టులు పోరాడ నవసరం లేకుండానే బంధించారు. జనరల్ నగాబూకూడా చిక్కాడు.

కాని ఖైదీల్ని దగ్గర కత్తులుంచుకో వచ్చని కమ్యూనిస్టులు చెప్పారు. ఇంతే కాదు. చీనా కమ్యూనిస్టు సైనికులతో సమానంగా జీతాలు ఇస్తారని కూడా చెప్పారు. తిన్నంత ఆహారం పెట్టారు. ఇళ్ళకు తిరిగిపోవాలనుకున్న వాళ్ళని వెళ్ళవచ్చన్నారు. ప్రజాసైన్యంలో చేరదల్చినట్లయితే ఆహ్వానిస్తామన్నారు.

"కమ్యూనిస్టుల్ని జయించడం అసాధ్యం" అని జనరల్ నగాబూ లాసా ప్రభుత్వానికి తెలియపరిచాడు. రాయబారాలకి సమ్మతమే నని టిబెట్ ప్రభుత్వం పెకింగ్ నగరానికి తెలియపరిచింది.

★

### ఖరనామ సంవత్సర

# ఆంధ్రపత్రిక ఉగాది సంచిక

### రచయితలకు విన్నపము

ఆంధ్రపత్రిక ఖరనామసంవత్సర ఉగాదిసంచికను ఉగాదినాటికే ప్రకటించగలందులకై ప్రయత్నములో నున్నాము.

ఆంధ్రపత్రిక ఉగాది సంచికలు, సాంస్కృతిక సాంఘిక, సారస్వత, రాజకీయాది సర్వవిషయములలోను విజ్ఞాన ప్రబోధకములై, చిరంతన ప్రయోజనకరమైన విలువ గలిగియుండు సంప్రదాయము, ఆంధ్ర పాఠకలోకమునకు సుపరిచితమైన విషయమే.

తదనుగుణ్యముగ రచయితలు, చిత్రకారులు, తమతమ ఉత్తమ వ్యాసములను, చిత్రములను, ఎప్పటి యభిమానముతోనే సంచికకు పంపి, మా కృషిని సఫలీకృతమగునట్లు చేయ ప్రార్థన.

సంచికను ఉగాదినాటికే వెలువర్చుటకు, ఈ మాసాంతము లోపుగానైన వ్యాసములు, కథలు, చిత్రములు మొదలైనవి మా కార్యాలయమునకు చేరకున్న కృషి సుకరము కాదుకాన, త్వరలో రచనలను మాకందునట్లు పంపవలసినదిగా రచయితలను విన్నవించుకొనుచున్నాము.

ఇట్లు,

సంపాదకుడు.